సామాజిక సేవా రంగాల్లో

# మహిళా సంఘాల పాత్ర ఎంతో కీలకం

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

మహిళా సంఘాల సభ్యులతో కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఫిబ్రవరి 22 : సామాజిక సేవా రంగాల్లో మహిళా సంఘాల పాత్ర ఎంతో కీలకమని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘాల బలోపేతానికై సీఆర్‌పీల వ్యూహంపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని దోమ, వికారాబాద్, ధారూరు, మర్పల్లి, మోమిన్‌పేట్ మండలాల్లో పలు జిల్లాలకు సంబంధించిన సీఆర్‌పీలు రెండు వారాల పాటు వివిధ గ్రామాల్లో సందర్శించి స్వయం సహాయక సంఘాల బలోపేతానికై శిక్షణ నిర్వహించారు.

ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనే సెర్ప్ యొక్క ప్రధాన ఉద్దేశమని, స్వయం సహాయక సంఘాలు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకుంటూనే సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. సమాజంలో బాల్యవివాహాలు, విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. మహిళా సంఘాలు పొదుపు చేయడమే కాకుండా, బ్యాంకుల నుంచి పొందిన రుణాలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ గ్రామాల్లో సంఘాలను నెలకొల్పడమే కాకుండా సమావేశాలు నిర్వహించి మూతపడిన సంఘాలను పునరుద్ధరించేలా అధికారులు, సంఘాల నాయకులు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

మహిళలు ఆత్మబలాన్ని పెంపొందించుకొని అవసరమైన రంగాల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించుకుంటూ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఆసక్తి ఉన్న మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించుకొని పొదుపు, స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ రుణాలు, బ్యాంకులకు చెల్లించిన అప్పుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటూ పుస్తక నిర్వహణను చేపట్టాలని సూచించారు. రుణాలు పొందిన మహిళా సంఘాలు సకాలంలో రుణాల చెల్లింపుల్లో వైఫల్యం చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతలు తీసుకొని స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు సమావేశాలు నిర్వహించుకుని కార్యాచరణతో ముందుకు వెళ్లేలా పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. సమీక్షా సమావేశం సందర్భంగా వివిధ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహించి గ్రామాల్లో మహిళా సంఘాల బలోపేతానికి సంబంధించి సూచించిన విషయాలను కలెక్టర్‌కు తమ నివేదికల ద్వారా సీఆర్‌పీలు వివరించారు. సమీక్షా సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాస్, అదనపు డీఆర్డీవో సరోజ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు అలివేలు, డీపీఎం వీరయ్య, గ్రామ మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీసీ సెల్ విభాగం మండల అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

## ప్రతి ఒక్కరినీ కలుపుకొనిపోవాలి

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, ఫిబ్రవరి 22 : ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు పోవాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తెలిపారు. శనివారం వికారాబాద్‌లోని ఆనంద్ ఇంటి వద్ద బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ మండల నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు వికారాబాద్ మండల నూతన జనరల్ సెక్రటరీగా శివకుమార్, మండల ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడిగా సిద్దులూర్ శీను, మండల బీసీ సెల్ విభాగం అధ్యక్షుడిగా మల్లేశ్‌యాదవ్, యూత్ జనరల్ సెక్రటరీగా ఎర్రవల్లి శ్రీధర్‌రెడ్డి, సోషల్ మీడియా జనరల్ సెక్రెటరీగా శ్రీనివాస్‌గౌడ్ లను నియమించారు. కార్యక్రమంలో వికారాబాద్ మండల మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు అశోక్, మండల మైనార్టీ విభాగం అధ్యక్షుడు గయాజ్, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్, మాజీ సర్పంచ్ అంజయ్య, నాయకులు సత్యయ్యగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మణ్, హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్, మాజీ వార్డు మెంబర్ మల్లేశ్ ఉన్నారు.

కేరళ రాష్ట్ర సహకార బ్యాంక్ ప్రతినిధులకు వివరాలను వెల్లడిస్తున్న కార్యదర్శి రాందాస్

## తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం సందర్శన

తుర్కయంజాల్, ఫిబ్రవరి 22 : సహకార విద్య, శిక్షణలో భాగంగా తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం ప్రధాన శాఖను కేరళ రాష్ట్ర సహకార బ్యాంక్ ప్రతినిధులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు సహకార సంఘాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రైతుల సంక్షేమం కోసం చేస్తున్న పనులను వారు ప్రత్యేకంగా అభినందించారు. సంఘం కార్యదర్శి రాందాస్ వారికి సంఘం వివరాలను తెలిపారు. కార్యక్రమంలో కేరళ స్టేట్ బ్యాంక్ వైస్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కన్నన్, కేరళ ప్రతినిధులు సునీత, పిళై, నారాయణన్, జయశంకర్, శైలజ పాల్గొన్నారు.

## ధరలు లేక విలవిల

- సన్నకారు రైతులను నిలువునా ముంచిన టమాట
- ఆటో చార్జీలు కూడా రావడంలేదని ఆవేదన

కేశంపేట, ఫిబ్రవరి 22 : యాసంగి సీజన్‌లో టమాటకు మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో రైతన్నలు అప్పులపాలవుతున్నారు. ఎకరాకు రూ.60వేల ఖర్చుతో టమాటను సాగు చేస్తే ప్రస్తుతం కూలీలకు కూలీ డబ్బులు సైతం రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ఒక బాక్సు టమాట ధర రూ.300లోపు పలుకుతుండడంతో అటు మార్కెట్‌కు తీసుకుపోలేక, ఇటు చేనులో వదిలేసేందుకు మనస్సు ఒప్పక దిక్కుతోచని స్థితిలో రైతన్నలు కొట్టుమిట్టాడుతున్నారు. ఇక కోసిన టమాటను మార్కెట్‌కు తరలించేందుకు ఆటో చార్జీలు సైతం రావడంలేదని మండల రైతులు చెబుతున్నారు. కేశంపేట మండలవ్యాప్తంగా 752 మంది చిన్న, సన్నకారు రైతులు 737ఎకరాల్లో టమాటను సాగు చేసినట్లు ఉద్యానవనశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మండలంలోని సుందరాపురం గ్రామానికి చెందిన పగడాల ఆంజనేయులు అనే రైతు 1.5 ఎకరాల్లో టమాటను సాగు చేశాడు. ఎకరాకు రూ.60వేల చొప్పున ఎకరంన్నర పొలానికి రూ.90వేల ఖర్చు వచ్చిందని, తీరా పంట చేతికొచ్చాక కూలీలకు సైతం డబ్బులు ఎల్లడంలేదని అసహనాన్ని వ్యక్తం చేస్తున్నాడు. పంట అధికంగా వస్తే సర్కారు కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేసి నిల్వ ఉండేలా చేస్తేనే రైతుకు మేలు జరుగుతుందని కోరుతున్నారు.

సుందరాపురంలో టమాటను బాక్సుల్లో పేర్చుతున్న కూలీలు

## నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

ఎస్పీ నారాయణరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 22 : ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూపు-4 ఫలితాల ద్వారా పోలీస్ శాఖలో నేరుగా నియమించబడిన జూనియర్ అసిస్టెంట్లకు ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీసు అకాడమీ, హైదరాబాద్‌లో 6వారాల 'బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్' నిర్వహించారు. శిక్షణలో భాగంగా శనివారం 71 మంది ట్రైనీ జూనియర్ అసిస్టెంట్ అధికారులు డీపీవో వికారాబాద్‌ను సందర్శించి, డీపీవోలోని ఏ సెక్షన్, పే సెక్షన్, బడ్జెట్ సెక్షన్, ప్రజా వినతుల పరిష్కార విధానాలు, వివిధ విభాగాల మధ్య సమన్వయం మొదలైన అంశాలపై శిక్షణ పొందారు. బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్‌కు వచ్చిన జూనియర్ అసిస్టెంట్ అధికారులతో ఎస్పీ నారాయణరెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో పరిపాలనా విభాగం కీలకమైనది. మీరు సాంకేతిక పరిజ్ఞానం, నూతన విధానాలను అవలంబించి నిష్పక్షపాతంగా, పారదర్శంగా పనిచేయాలి. పోలీసు శాఖలో సేవలందించేందుకు నైతిక విలువలు, క్రమశిక్షణ, సమర్థత ఎంతో ముఖ్యం. పోలీస్ సిబ్బందికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా సత్వర సేవలు అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, ప్రశాంతమైన వాతావరణంలో పనిచేసేలా అలవాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ట్రైనీలు తమకు వచ్చే సందేహాలను అధికారులతో చర్చించి పోలీసు పరిపాలనలోని నైపుణ్యాలను మెరుగుపరుచుకునేలా శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ టీవీ హనుమంత్‌రావు, ఆర్‌బీవీఆర్‌ఆర్ డీఎస్పీ భాస్కర్, వికారాబాద్ ఏఆర్ డీఎస్పీ వీరేశ్, బి సెక్షన్ సూపరింటెండెంట్ మోహనప్ప, పే సెక్షన్ సూపరింటెండెంట్ మీర్జా జావిద్ బేగ్, ఆర్ఐ డేవిడ్ విజయ్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

## ప్రకృతి, పర్యావరణంపైనే మానవ మనుగడ

- గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- కన్హాలో ముగిసిన జాతీయ జీవ వైవిధ్య యువజన సదస్సు

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న గవర్నర్

నందిగామ, ఫిబ్రవరి 22 : ప్రకృతి పర్యావరణంపైనే మానవ మనుగడ ఆధారపడి ఉందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. నందిగామ మండలం కన్హా శాంతివనంలో మూడు రోజులుగా కొనసాగుతున్న జాతీయ జీవ వైవిధ్య యువజన సదస్సు ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యావరణం, ప్రకృతి దేవుడు ఇచ్చిన వరమని పేర్కొన్నారు. అంతరించిపోతున్న సహజ సంపదను, జీవరాసులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అభివృద్ధి పేరిట ప్రభుత్వాలు పర్యావరాణాన్ని నాశనం చేయాకూడదని, పర్యావరణ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా యువత పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మూడు రోజులుగా జరిగిన జాతీయ సదస్సులో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో 28 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 72 మంది విద్యార్థులు, ఎన్విరాన్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అమర్ నదిన్, రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు డైరెక్టర్ కాళీచరణ్ పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు లింగోజిగూడ డివిజన్ వాస్తవ్యుడు పార్శపు శ్రీధర్ మాతృమూర్తి యశోద ఈ నెల 6న మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శనివారం లింగోజిగూడలోని పార్శపు శ్రీధర్ స్వగృహానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. - ఎల్బీనగర్, ఫిబ్రవరి 22

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కేంద్ర కమిటీ బృందం అధికారి డాక్టర్ ఎన్‌సీ పాల్

ఆమనగల్లు, ఫిబ్రవరి 22 : వంతెన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని (సీఆర్ఎం) కామన్ రివ్యూ మిషన్ (ఎంవోఆర్‌డీ) మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అధికారి డాక్టర్ ఎన్‌సీ పాల్ అధికారులకు సూచించారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో శనివారం రాత్రి కేంద్ర కమిటీ బృందం పర్యటించింది. ఆమనగల్లు మండలం మేడిగడ్డ, శంకర్‌కొండ తండాల మధ్య కత్వా వాగుపై రూ. 3.10 కోట్లతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను, ఆమనగల్లు, కడ్తాల్ మండల కేంద్రాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇళ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాల్ మాట్లాడుతూ.. వర్షాకాలం వచ్చే నాటికి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్ వెంకటరమణను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకే ఇళ్లను మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమమాధురి, గృహనిర్మాణ శాఖ ఎస్పీ భాస్కర్‌రెడ్డి, డీఈఈ సురేశ్, ఏఈ శ్రీనివాస్, పంచాయతీరాజ్ శాఖ డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ అభిషేక్, ఎంపీవో వినోద, గ్రామ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంవోఆర్‌డీ అధికారి డాక్టర్ ఎన్‌సీ పాల్, అధికారులు

## సాంకేతిక రంగంలో రాణించాలి

ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామిగుప్తా

సమ్మేళనంలో బుక్ ఆఫ్ ఆబ్‌స్ట్రాక్ట్స్, ప్రొసీడింగ్స్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు

ఆదిబట్ల, ఫిబ్రవరి 22 : సాంకేతికరంగంలో వస్తున్న మార్పులపై విద్యార్థులు దృష్టిసారించి అధ్యయనం చేయాలని ఐఐఐటీఆర్‌కే వ్యాలీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామిగుప్తా అన్నారు. రెండు రోజులుగా ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పల్లి సి.వి.ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెన్యూవబల్ ఎనర్జీ, గ్రీన్ కంప్యూటింగ్, సస్టేయినబుల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై ఈ.ఈ.ఈ డిపార్ట్‌మెంట్ అంతర్జాతీయ సదస్సును నిర్వహించింది. శనివారం ఈ సదస్సు ముగింపు సందర్భంగా మాట్లాడుతూ.. కండెన్స్‌డ్ బయో గ్యాస్ ఆధారిత శక్తి ఉత్పాదక కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను ఇస్తున్నదన్నారు. ఐ.ఎస్.టి.ఈ ప్రారంభించబోయే కార్యక్రమాలపై వివరించారు. ఈ సదస్సులో విద్యార్థులకు సరికొత్త విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు దేశంలోని అనేక ప్రాంతాల నుంచి పేపర్లను ప్రముఖులు సమర్పించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంతం నుంచి 71 పేపర్లను ఎంపిక చేశామన్నారు. 23 అంతర్జాతీయ పేపర్లు ఇరాక్, అమెరికా, ఉక్రెయిన్, మొరాకో, ఈక్విడార్ దేశాల నుంచి వచ్చాయని ఈ.ఈ.ఈ విభాగ అధిపతి శ్రీలక్ష్మి తెలిపారు. సమ్మేళనంలో బుక్ ఆఫ్ అబ్‌స్ట్రాక్ట్స్, ప్రొసీడింగ్స్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సుకు మొత్తం 350 పేపర్లు రాగా, అందులో 140 పేపర్లను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకున్న భరతనాట్యం

కొండాపూర్, ఫిబ్రవరి 22 : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం పలువురు నృత్యకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో తిల్లాన ఆర్ట్స్ అకాడమీ నాట్య గురువులు మాధవి మారెళ్లపూడి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన అలరించింది. గణపతి కౌతం, జతిస్వరం, ఇందరికి భయము ఇచ్చు చేయి, మల్లారి, తిల్లాన అంశాలను కళాకారులు ఆరాధ్య, స్వర, వీరింద, దియా, శ్రీనిక, లోషిత, వేదశి, ఇషితా, సన్నిధి, సహస్ర ప్రదర్శించారు.

## అలరించిన అన్నమయ్య సంకీర్తనలు

శ్రీస్వరసిద్ధి వేంకటేశ్వరస్వామి సంకీర్తనను ఆలపిస్తున్న కళాకారులు

మాదాపూర్ : శ్రీస్వరసిద్ధి వేంకటేశ్వర స్వామి కళాకారులు అన్నమాచార్య భావనవాహినిలో పద్మశ్రీ, డా.శోభరాజు ఆధ్వర్యంలో అన్నమయ్యపురం విద్యార్థులతో స్వరార్చన శనివారం నిర్వహించారు. శ్రీ కళ్యాణి మ్యూజిక్ అకాడమీ శిష్య బృందంతో అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. సితార శిష్య బృందం బి.శారద, ఎస్.నిర్మల, కుమారి ఎస్.రిషిక, డి.రవితేజ, కుమారి వై.నందిత, జి.ఎస్.ఎ. కాత్యాయని, బి.శ్రీ దేవి, కుమారి ఎ.సంవిధ, సితారతో కలిసి బి.వి.రమణ మూర్తి, జగన్ దత్తు, శ్రీమతి డి.స్వాతి, మనోజ్ మోహంటి తబలా సహకారం అందించారు.

## పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

- అసంపూర్తిగా ఉన్న శ్మశాన వాటిక పనులు చేయండి
- సంయుక్త మార్కెట్ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలి
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

తుక్కుగూడ మున్సిపాలిటీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట్, ఫిబ్రవరి 22: పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. తుక్కుగూడ మున్సిపాలిటీ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసంపూర్తిగా ఉన్న శ్మశానవాటిక పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. తుక్కుగూడ వరకు రోడ్డు విస్తరణ చేయవలసి ఉందన్నారు. కొంతమేరకు పనులయినా ఇంకా పూర్తి చేయాల్సి ఉందన్నారు. శ్రీశైలం హైవే రోడ్డుపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయిస్తామన్నారు. అందుకు మూడు కోట్ల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. సంయుక్త మార్కెట్ పనులను త్వరగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. స్ట్రీట్ వెండర్స్‌కు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. జరుగుతున్న పనులన్నీ కూడా సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని, ముఖ్యంగా రాబోయేది వేసవికాలమని మున్సిపాలిటీలో ఎక్కడ కూడా నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా వెలుస్తున్న విల్లాలు, కాలనీలకు మౌలిక సౌకర్యాలు కల్పించవలసిన అవసరం ఉందన్నారు. రానున్న రోజులలో తుక్కుగూడ మెయిన్ సెంటర్‌గా మారబోతుందన్నారు. అందుకనుగుణంగానే ట్రాఫిక్ సమస్య రాకుండా రోడ్ల విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన సమస్యలపై అధికారులు దృష్టి సారించవలసిన అవసరం ఉందన్నారు. చేయవలసిన పనులు, టెండర్ వేయవలసినవి పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## తండ్రిని చంపిన తనయుడు

మద్యం తాగి వేధిస్తున్నాడని.. హత్య

చర్లపల్లి, ఫిబ్రవరి 22 : నిత్యం మద్యం సేవించి కుటుంబసభ్యులను వేధిస్తున్న తండ్రిని కొడుకు హత్య చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పెద్దపల్లి జిల్లా వెన్నెంపల్లి గ్రామానికి చెందిన అరెల్లి మొగిలి(45) తన భార్య లావణ్యతో కలిసి సికింద్రాబాద్ లాలాపేట ఇందిరానగర్‌కు వచ్చి తన కుమారుడు సాయికుమార్(25), కూతురు శ్రావణితో కలిసి నివాసముంటున్నాడు. తండ్రీకొడుకులు లాలాపేటలోని శివ శక్తి ప్యాకర్స్, మూవర్స్‌లో పనిచేస్తున్నారు. మొగిలి నిత్యం మద్యం తాగి పేకాట ఆడేందుకు డబ్బులు ఇవ్వాలని కుటుంబ సభ్యులను నిత్యం వేధించేవాడు. శనివారం ఉదయం మద్యానికి డబ్బులు ఇవ్వాలని భార్య, కుమారుడితో మొగిలి గొడవపెట్టుకున్నాడు. అనంతరం మొగిలి మధ్యాహ్నం బస్సులో ఈసీఐఎల్ చౌరస్తాకు వచ్చాడు. మానసికంగా విసిగిపోయిన కుమారుడు సాయికుమార్ ఎలాగైనా తన తండ్రి ఇబ్బందుల నుంచి కుటుంబాన్ని కాపాడుకోవాలని తనతో పాటు ఇంట్లో నుంచి తీసుకువచ్చిన కత్తితో ద్విచక్రవాహనంపై తండ్రిని వెంబడించాడు. ఈసీఐఎల్ చౌరస్తాలో బస్సు దిగి రోడ్డుపైకి వచ్చిన మొగిలిని పోలీస్‌స్టేషన్ సమీపంలోనే కుమారుడు సాయికుమార్ విచక్షణ రహితంగా 15చోట్ల కత్తితో పొడిచాడు. దీంతో స్థానికులు, ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మొగిలి కుమారుడు సాయికుమార్‌ను అదుపులోకి తీసుకొని మొగిలిని మెరుగైన వైద్యం కోసం స్థానికంగా ఉన్న ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మొగిలి మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

## వివిధ లా కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకాం ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, తదితర కోర్సుల మూడో సెమిస్టర్, ఎల్ఎల్ఎం మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 11లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుంతో ఈ నెల15 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల పరీక్ష తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలతో పాటు బీపీఈడీ వన్ టైం చాన్స్ పరీక్షలను వచ్చే నెల 6 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

## పీజీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## కొనసాగుతున్న ఆర్.బి.ఎస్.కె. ప్రోగ్రాం

కొండాపూర్, ఫిబ్రవరి 22 : కొండాపూర్‌లోని రంగారెడ్డి జిల్లా దవాఖానలో కొనసాగుతున్న రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం(ఆర్.బి.ఎస్.కె)నకు శనివారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ జి.అజయ్ కుమార్ పరిశీలించారు. ఆయన దవాఖానలో కొనసాగుతున్న పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్క్రీనింగ్‌కు హాజరైన చిన్నారులతో ముచ్చటించి, పరీక్ష సమయంలో సేవలపై వాకబు చేశారు. కార్యక్రమం మార్చి 15 వరకు కొనసాగుతుందని వైద్యులు తెలిపారు.

## హయత్‌నగర్‌లో కిసాన్ మేళా

సైదాబాద్ ఫిబ్రవరి 22 : సంతోష్‌నగర్ (క్రీడా, కేవీకే రంగారెడ్డిజిల్లా ఐసీఆర్-సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రై లాండ్ అగ్రికల్చర్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కిసాన్ మేళాను నిర్వహించనున్నట్లు క్రీడా ప్రకటనలో తెలిపింది. హయత్‌నగర్‌లోని రీసెర్చ్ ఫార్మ్‌లో జరిగే ఈ కార్యక్రమాన్ని రంగారెడ్డి కలెక్టర్ ప్రారంభిస్తారని తెలిపారు.